కథ

# ఇలా జరిగింది

- వలివేటి నాగచంద్రావతి

మామిడిచెట్లకింద ఒత్తుగా పడున్నాయ్- ఎదిగీ ఎదగని పిందెలు. కాస్త పెద్ద సైజు కాయల్ని ఏరి బుట్టలో వేస్తోంది చిలక.

"ఈ రాలుడు చూస్తోంటే ఈ ఏడు కూడా సార్‌కి ఏం మిగిలేట్టు లేదు" అన్నాడు రాజు సానుభూతిగా.

"మరే. కూతురికి లగ్గం కూడా పెట్టుకున్నాడు పాపం" మగని మాటని ఒప్పుకుంది చిలక.

సుబ్బారాయుడిగారి పదెకరాల మామిడితోట అది. ఊరొదొలంగానే రోడ్డుపక్కంటే కనబడుతుంది. రాజు, చిలక ఆ తోటకి కాపలాదార్లు. కాయలు కోసే సమయంలో ఎండవేళ తను కాస్త నడుం వాల్చేందుకని సిమెంటురాళ్ళతో నాలుగ్గోడలు లేపి తాటాకుల పైకప్పుతో చిన్న షెడ్డొకటి వేయించాడు సుబ్బారాయుడు ఎప్పుడో. ప్రస్తుతం దాన్లోనే ఉంటున్నారు వాళ్ళిద్దరూ- వాళ్ళకిద్దరూను.

ఇంతకుముందు తోట కాపలాకి రాఘవయ్య ఉండేవాడు. రాఘవయ్య రాజుకి తండ్రి. రాఘవయ్య పోయాక సుబ్బారాయుడు కాపలా మనిషికోసం వెతుకుతోంటే "ఎవరో ఎందుకులే బాబూ... తోట ఇంట్లో ఉండనిచ్చేట్టయితే నేనే ఉంటా" అని ముందుకొచ్చాడు రాజు. అప్పటివరకూ కూలీనాలీకి వెడుతూండేవాడు రాజు. ఒకనాడు పని దొరికీ ఒకనాడు దొరక్కా ఇబ్బందిపడేవారు. ఇక్కడికి వచ్చాక వాళ్ళ పని బావుంది.

సుబ్బారాయుడిగారి అనుమతి తీసుకుని చెట్టుచెట్టుకీ మధ్య కాస్త ఎండపొడ పడేచోట నాలుగు ఆకుకూర మళ్ళ వేసుకున్నారు. పొద్దున్నపూట అవి కట్టలు కట్టి ఊళ్ళోకి పోయి అమ్ముకొస్తుంటాడు రాజు. ఆ ఎండుపుల్లా ఈ చెట్టు బెరడూ ఏరుకొచ్చి వంటకి కట్టెల ఖర్చు మిగులుస్తుంది చిలక. సుబ్బారాయుడుగారిచ్చే వేణ్ణీళ్ళకి ఇవి చన్నీళ్ళు.

వాళ్ళ పెద్దకొడుకు గోపాలు ఇక్కడికి రాక ముందు ఊళ్ళోనే ఎలిమెంటరీ స్కూలుకెళ్ళేవాడు. చదువు మాటెలా ఉన్నా గోళీకాయలు, కర్రాబిళ్ళలో ఛాంపియనయిపోయాడు. తోటలోకి మారాక వాడి చదువు కూడా ఓ దారినపడ్డది.

తోటదాటి ఇంకో అరపర్లాంగు దూరంలో క్రిస్టియన్ ఆర్ఫనేజ్ కమ్ స్కూలొకటుంది. అందులో నాలుగోక్లాసులో చేర్చారు గోపాలుని. అక్కడ చదువు శ్రద్ధగా చెప్తున్నారు. మధ్యాహ్నంపూట ఆర్ఫనేజి పిల్లలతోపాటు బయటనించొచ్చే పేద పిల్లలకు కూడా భోజనం పెడతారు. పుస్తకాలూ పండ్స్ బాగా ఉంటే ఒక్కోసారి బట్టలు కూడా ఉచితంగా ఇస్తారు. కనుక కొడుకు చింత తీరిపోయింది ఇక్కడికొచ్చాక. మిగిలింది సావిత్రి. మూడేళ్ళపసిదానితో సమస్యేముంటుంది?

'ఈ తోటని నమ్ముకుని మేం చల్లగానే ఉన్నాం. తోట సంగతే బాగాలేదు' చిన్నపాటి గాలి తెరకే వడగళ్ళలా రాలిపడుతోన్న మామిడిపిందెల్ని చూస్తూ, "ఇంకో పాతికవేల పద్దని చూసుకున్నాడుగానీ ఇంకోసారి నీళ్ళు పెట్టుంటే బాగుండేది" నిస్సహాయంగా అనుకున్నాడు రాజు.

తోటలో బావి ఉంది. ఎప్పుడో సుబ్బారాయుడి ముత్తాతల కాలంలో వేయించింది. అయిదేళ్ళ కిందటిదాకా కూడా నూతిలో నీళ్ళు పుష్కలంగా ఉండేవి. తోట తనివితీరా తాగినా జానెడులోతు గూడా తగ్గినట్టుండేది కాదు. కొబ్బరినీళ్ళలాంటి తియ్యటి రుచి. గేటుకి దగ్గరగా ఉండటంవల్ల దారినపోయేవాళ్ళు కూడా దాహానికి లోపలికొచ్చి నీళ్ళు తోడుకుని తాగిపోయేవాళ్ళు.

తరవాత్తరవాత చుట్టూ తోటల్లో బోర్లొచ్చేశాయి. బావిలో జల తగ్గింది. తోటకి బొటాబొటిగా సరిపోతూ వచ్చాయి. కిందటేడు చెట్లకి పళ్ళాలు కట్టి ఒక్కసారి నీళ్ళుపెట్టేసరికే అడుగంటాయి. కాయసైజు పెరగలేదు రంగూ రాలేదు. ఈ ఏడు అవీ లేవు. మోటరూ గొట్టాలూ అద్దెకి తెచ్చి పక్కతోట బోరునుంచి నీళ్ళు పెడితే పాతికవేలయింది.

"పిందెలు విపరీతంగా రాలుతున్నాయ్. ఇంకొక్క తడి తగిలిస్తే..." అనబోయాడు రాజు.

"మళ్ళీ నీళ్ళంటే ఇంకో పాతికవేలు. నాలుగురోజుల్లో డబ్బు చూసుకుని బోరు వేయించేస్తాను. బావి ఉన్నచోటే జల ఉన్నదట. ఇంకొంచెం లోతుకు పోతే నీళ్ళకి కొరవుండదన్నాడు వీరభద్రయ్య మొన్నొచ్చినప్పుడు" అన్నాడు సుబ్బారాయుడు.

వీరభద్రయ్యంటే తోటల్లో భూమికి చెవి ఆన్చి నీళ్ళు ఎక్కడ పడతాయో చెప్పే అనఫిషియల్ జియాలజిస్ట్.

"నాలుగు రోజులన్నాడు... వారమైంది అతీ గతీ లేదు" వచ్చే ఆవులింతకు నోటి దగ్గర చిటికేసుకుంటూ అనుకున్నాడు రాజు.

★ ★ ★

రాత్రి పెద్ద గాలీవానా. పొద్దున్న వెలిసింది. తోటకి నీళ్ళు పెట్టే పని తప్పిపోయింది. ఆపై కాయలు కోసే పనికూడా తప్పిపోయినట్టుగా ఉంది. సగానికి సగం కాయలు నేలరాలాయి.

"ఈ సంగతి సుబ్బారాయుడు సార్‌కి చెప్పొస్తాను" అంటూ ఊళ్ళోకి బయలుదేరాడు రాజు. తోట దాటేముందు చూశాడు. రాత్రి గాలికి మామిడిచెట్టు పెద్దకొమ్మొకటి విరిగి బావి మీద పడింది. ఆ బరువుకి గావును నూతి ఒర ఆ పక్క పూర్తిగా విరిగిపోయింది.

రాజు వెనక్కి వచ్చాడు. "కొమ్మపడి బావిగట్టు తెగిపడింది. పిల్లల్నటు వెళ్ళనియ్యమాకు. ఇయ్యాల ఆదివారమేగా. గోపాలుగాణ్ణి సావిత్రిని చూస్తూండమను. ఈ సంగతి కూడా సార్‌కి చెప్పొస్తాను" చిలకని హెచ్చరించి వెళ్ళిపోయాడు రాజు.

"సర్లే" అంది చిలక.

అక్కడే ఉన్నాడు గోపాలు- తను పుస్తకాలు పెట్టుకునే జాజికాయపెట్టెలో దేనికోసమో వెతుకుతూ "ఇన్నావా అయ్య చెప్పిందీ- ఎక్కడికీ ఎళ్ళమాకు. చెల్లెల్ని చూస్తా ఉండు" అంది కొడుకుతో. బుడగలో గాలి తీసేసినట్టయిపోయాడు గోపాలు. ఇవాళ ఆదివారం. మిత్రులందరితో కలిసి గోళీలాటకి ప్లాను వేసుకున్నాడు. గోళీలు వెతుకుతూ ఆ సన్నాహాల్లోనే ఉన్నాడు కూడా. తల్లిమాట ఎదిరించటానికి లేదు. చితక బాత్తుంది. ఇంకేం చేస్తాడు పాపం. సావిత్రిని కాళ్ళుజాపి కూర్చోమని కాళ్ళాగజ్జా ఆడ్డం మొదలుపెట్టాడు.



అన్నం వార్చి పక్కన పెట్టింది చిలక. పులుసుడాక పొయ్యిమీద పెట్టి బిందె తీసుకుని "నిమిసంలో నీళ్ళట్టుకొస్తా, ఈడనే ఆడుకోండి" అని చెప్పి పక్కతోట బోరు దగ్గరకు వెళ్ళింది చిలక.

అప్పటికే కాళ్ళాగజ్జా బోరుకొట్టింది అన్నా చెల్లెళ్ళకి. కాసేపు 'వానావానా వల్లప్పా' అంటూ గిర్రుగిర్రున తిరిగారు. ఇల్లు సరిపోలా. పుస్తకాల సంచిలోంచి ఎర్రగా కనబడుతోంది బంతి. దాన్ని కిందటిరోజు ఓ ఫాదరు ఇచ్చారు. కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చింది. దాన్ని తీసుకుని "రా, బయట ఆడుకుందాం" అని సావిత్రిని పిలిచి బయటకొచ్చాడు గోపాలు.

బంతి చెల్లెలికి అందేలా జాగ్రత్తగా నింపాదిగా తను వేయటం, సావిత్రి మాత్రం పకపకలాడుతూ ఇష్టమొచ్చినవైపు ఇష్టమొచ్చినట్టు విసిరెయ్యటం తను చితచితలాడుతున్న ఆ నేలలో, ఆ గడ్డి దుబ్బుల్లో దాన్ని వెతికి తీసుకురావటం మహా విసుగ్గా ఉంది గోపాలుకి.

ఈ లోపల చిలక ఓ బిందెనీళ్ళు గోలెంలో పోసి మళ్ళీ వెళుతూ "ఇక్కడే ఆడుకోండీ" అని మళ్ళోసారి హెచ్చరించటం అయింది. 'ఈ నీళ్ళ మోత ఎప్పుడవుద్దో. అమ్మ సావిత్రిని చూసుకుంటే తను బయటికి పరుగు తియ్యొచ్చును' ఈ ఆలోచనలో ఏమరుపాటున విసిరిన బంతి ఏ వైపున ఎక్కడపడిందో తెలీలేదు.

దాన్ని వెతకటంలోపడ్డాడు గోపాలు. సావిత్రి రెండు నిమిషాలు అన్నకోసం చూసి మెల్లగా తను కూడా కాళ్ళు కదిపింది. అవి గేటు వైపుగా సాగాయి.

పిచ్చిమొక్కకి పూసిన పసుపుపచ్చని పువ్వు... గరికమీద ఎగిరే బుల్లి తూనీగ... గడ్డిమీద మెరుస్తున్న వానబొట్టు... చిన్న గుంటలో నిలిచిన వాననీరు... ఆ బుల్లిపాదాల్ని ముందు ముందుకి నడిపిస్తూ నడిపిస్తూ సరిగ్గా నూతి దగ్గరకొచ్చేసరికి ఆపాయి. పడిపోయిన మామిడి కొమ్మకి ఓ చిన్నకాయకి పండిన రంగొచ్చి పచ్చగా ఆకర్షిస్తూ కనిపించి అటు మళ్ళించాయి.

గోపాలు బంతి వెతికి వెనక్కొచ్చి సావిత్రి కోసం చుట్టూచూస్తే నూతికి నాలుగడుగుల దూరంలో కనబడింది.

"వెళ్ళకెళ్ళకూ" గావుకేకలేస్తూ పరిగెత్తాడు.

సరిగ్గా ఒక్కంగ దూరం సావిత్రికీ గోపాలుకీ. అప్పుడే కాయకోసం నూతివైపు వంగింది సావిత్రి.

ఒక్క దూకుతో చెల్లెలి రెక్కందుకుని వెనక్కి లాగి పక్కకి ఒక్కతోపు తోశాడు గోపాలు. కానీ కానీ ఆ విసురుకి వెనక్కి తూలి విరిగిన ఒర ఖాళీలోంచి నూతిలోకి పడిపోయాడు.

★ ★ ★

ఏం చెప్పాలిక... పక్కకిపడిన సావిత్రి కెవ్వుకెవ్వున తోట మారుమోగేలా ఏడవటం, కూతురు ఏడ్పు విని చిలక పరిగెత్తుకుంటూ రావటం, సంగతెలిశాక 'నా కొడుకో' అంటూ గుండెలు బాదుకుంటూ అందర్నీ కేకెయ్యటం అయిదు నిమిషాల్లో జరిగిపోయాయి.

ఆ తరవాతంతా గందరగోళమే. నలుగురు కూడితే ఏమవుతుంది? ఒక్కొక్కళ్ళూ ఒక్కో సలహా. పాత సంఘటనల పునశ్చరణ. అనుభవాల తిరగబోత. పిల్లల ఆగడాలమీద చర్చ.

సుబ్బారాయుడు పూనుకున్నాడు. తాళ్ళూ తంకర్లూ వచ్చాయి. వాటితోపాటూ నూతిలో దిగే మనుషులూ వచ్చారు. "బావి లోతని తటపటాయించొద్దు. మీరడిగినంత నేనిస్తా" అని వాళ్ళకి హామీ ఇచ్చాడు సుబ్బారాయుడు.

తాడు కట్టుకుని బావిలో దిగిన మనిషి పైకొచ్చేదాకా చిలక ఏడుస్తూనే ఉంది. ఎన్ని మొక్కులో మొక్కుకుంటూనే ఉంది. రాజయితే నూతి చుట్టూరా తిరుగుతూనే ఉన్నాడు. వచ్చిన వాళ్ళు ఒక్కళ్ళూ కదలలేదు. ఎవరి మొహం చూసినా విపరీతమైన టెన్షన్... ఆందోళన.

అందరి ఉత్కంఠకూ తెరపడింది. బావి లోంచి గోపాలు శరీరం బయటకు తీశారు. పడటమే రాతిమీద పడుంటుంది తల. చిద్రుపలైపోయింది.

"ఓ..." లోకంలో గర్భశోకానికి మించిన వేదన లేదు. కడుపుకోతకి గురైన ఓ అమ్మా నాన్నల ఆర్తనాదమది.

శోకం, ఓదార్పు, విచారం, సానుభూతి, విరక్తి, వైరాగ్యం... కాసేపటిదాకా అక్కడి వాతావరణమే విషాదయోగాన్ని ప్రవచిస్తున్నట్టుగా ఉంది.

ఈలోపల ఆవేశపరులు కొంతమంది మట్టి తవ్వి బావి పూడ్చటం మొదలుపెట్టారు. రాజు, చిలకల దుఃఖం ఉపశమించేట్టుగా లేదు. 'ఆ బాధ తగ్గేదికాదు. మిగతా పని చూడండి' అన్నారెవరో.

'ఆట్లాడుకునే చిన్న పిల్లడు. అర్థాంతరంగా



పోయాడు. ప్రాణం లేకపోయినా ఆత్మ వుంటుద్ది కదా. అదయినా లేతది పసిది కదా. పెద్దోళ్ళని కాల్చే ఆ పల్లకాటికి తీసికెడితే బెంగటిల్లదా' 'బావెటూ పూడుస్తున్నారు. అక్కడే పాతేస్తే పోలా- పెశాంతంగుంటదూ-' తలా తోకాలేని సెంటిమెంటు లేవదీశాడో పెద్దమనిషి. అవునవునంటూ వంతపాడాయింకో పదిగొంతులు. కాదంటే కలసికట్టుగా కర్రలు ఎత్తే పామరజనం, ఇష్టం లేకపోయినా తల ఊపక తప్పలేదు సుబ్బారాయుడికి.

రబ్బిష్‌తో నుయ్యి పూడ్చారు. ఆ పక్కనే గోపాలు శాశ్వత నిద్రకి పక్కపరిచారు.

ఆ తర్వాత ఎంతకాలమో ఆ ఊళ్ళో ఉండలేకపోయింది రాజు కుటుంబం.

చిలక అక్కా- బావా ఎక్కడో ఉత్తరాది రాష్ట్రంలో ఉన్నారు- అక్కడ తయారవుతోన్న ఆనకట్ట దగ్గర పనులు చేసుకుంటూ. చెల్లెల్ని ఓదార్చటానికి వచ్చి "ఏదో ఒక పని మీకూ దొరక్కపోదు వచ్చేయండి" అని హామీ ఇవ్వటంతో వాళ్ళతోపాటే దూరానికి వెళ్ళిపోయారు- క్షణక్షణం జ్ఞాపకం చేసి మనసును కలచివేస్తున్న ఆ పరిసరాలను వదిలేసి.

★ ★ ★

వీపున పుస్తకాల సంచీ, చేతిలో దోర జామకాయ. కొంచెంకొంచెంగా కొరుక్కు తింటూ స్కూలుకు వెళుతున్నాడు రాఘవ. ఆరోజు లెక్కల పరీక్ష. పదమూడో ఎక్కం లోపల్లోపల వల్లె వేసుకుంటూ నడుస్తున్నవాడల్లా సుబ్బారాయుడి తోటదగ్గరకొచ్చేసరికి కాళ్ళకి బంధం వేసినట్టు ఆగిపోయాడు. గోపాలు గుర్తుకొచ్చాడు రాఘవకి. గోపాలూ వాడూ ప్రాణస్నేహితులు. రోజూ కలిసే స్కూలుకి వెళ్ళేవారు.

తనకి గోలీలాడ్డం నేర్పింది వాడే. బొంగరానికి తాడు చుట్టడమెలాగో చూపించిందీ వాడే. కొబ్బరిలౌజు, తాటితాండ్ర ఏది తెచ్చుకున్నా తనకి పెట్టకుండా అస్సలు తినేవాడు కాదు. కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి రాఘవకి.

తోటగేటు తీసే ఉంది. దూరంగా పనివాళ్ళూ సుబ్బారాయుడూ కనిపిస్తున్నారు. రాఘవ సరాసరి గోపాలుని పాతిపెట్టినచోటికి వెళ్ళి నిలబడ్డాడు. 'ఎప్పుడూ ఆపకుండా గడగడా కబుర్లు చెప్పేటోడు. ఇప్పుడీ మట్టిదిబ్బ కింద...' మళ్ళీ కళ్ళు చెమ్మగిల్లాయి రాఘవకి. 'ఎంత మంచోడో గోపాలు' అనుకున్నాడు.

రాఘవకి ఒక బలహీనతుంది. వందసార్లు చదువుతాడు. కంఠోపాఠంగా వచ్చేస్తుంది. తీరా పరీక్ష రాయటానికి కూర్చోగానే బుర్ర బ్లాంకైపోతుంది. ఆ సమయంలో కనుక మొట్టమొదటి ముక్క అందిస్తే చాలు... ఇక పెన్నాపడు. ఆ పని గోపాలు చేసేవాడు. పక్క బెంచీనే వాడిది.

'ఈరోజు పరీక్షెలాగో' బ్యాగ్ భుజంపైకి లాక్కుంటూ మరోసారి సమాధికేసి దిగాలుగా చూసి వెనక్కి తిరిగాడు రాఘవ.

మొదటి పీరియడే పరీక్ష. షరా మామూలే. ఆలోచననేదే రావట్లేదు తల్లోకి. అలవాటుగా పక్క బెంచీకేసి చూశాడు రాఘవ. 'ఇప్పుడు గోపాలుంటే ఎంత బావుండును' అనుకున్నాడు. 'ఇప్పుడు గోపాలు ఉంటే ఏం చెప్పేవాడు?' అనుకున్నాడు. కుదిపినట్టుగా కదలిక వచ్చింది. ఈసారి క్వశ్చన్ పేపరు చూస్తే భయం వేయలేదు. చెవిదగ్గర గోపాలు 'ఇవి కూడు, అవి దాన్లో తీసెయ్. ఆ మొత్తాన్నీ భాగించు' అని గుసగుసగా చెబుతున్నట్టుగా ఊహించుకుంటూ చురుగ్గా పేపరు పూర్తిచేసేశాడు రాఘవ.

ఆమాటే సాయంత్రం ఇంటికొచ్చాక తల్లితో చెప్పాడు. "గోపాలు పేరు తలుచుకున్నానో లేదో లెక్కలన్నీ వాడే చేసేసినట్టుగా పేపరు పూర్తయిపోయిందే అమ్మా" అని.

రాఘవ తల్లి కాంతానికి కాస్త వాగుడెక్కువ. కొడుకు మాటలకి కాస్త మసాలా జోడించి ఆకట్టుకునే రంగద్ది పక్కింటావిడకి వడ్డించింది. "విన్నావా కామాక్షొదినా ఈ విచిత్రం... పొద్దున్న మావాడు సుబ్బారాయుడి తోటపక్కింటా స్కూలుకి వెడుతోంటే ఆ గోపాలు పిలిచినట్టనిపించిందట. లోపలికెళ్ళి దండం పెట్టుకుని వచ్చేశాడంట. అంతే... ఏమయిందో తెలీదు.

ఈరోజు స్కూల్లో పరీక్ష రాయటానికి కూర్చు న్నాడా మైకం కమ్మినట్టయిందంట. తీరాచూస్తే పేపరు పూర్తయి ఉందంట. ఇదంతా ఆ గోపాలు మహిమేనమ్మా అంటున్నాడు మా రాఘవ" అంటూ.

"నిజంగా?" కళ్ళు పెద్దవిచేసి విన్న ఆ కామాక్షికి కల్పనా చాతుర్యం మరీ ఎక్కువ. అంచేత ఇంకో పదిమందికి ఇంకొన్ని అతిశయో క్తులు మేళవించి మరీ పంచిపెట్టేసింది. "మొన్న నూతిలోపడి చచ్చిపోయాడే ఆ గోపాలు- రాఘవకు కల్లో కనబడి 'నా సమాధికి దణ్ణం పెట్టి మొక్కుకో. నువ్వడిగింది నేను తీరుస్తా' అని చెప్పాట్ట. కాదంటానికి లేదు సుమా! ఏ పాపాలూ అంటని చిన్నవయసులో బలవంతంగా ప్రాణాలు పోగొట్టుకున్నాడా- అట్టాంటి మంచి వాళ్ళ ఆత్మకి శక్తి ఎక్కువ. వాళ్ళే దేవతలుగా వెలుస్తారమ్మా- అని మా అమ్మమ్మ చెప్పేది. రాఘవ పరీక్షలన్నీ కనికట్టు చేసినట్టు ఎవ్వరికీ కనబడకుండా ఆ గోపాలే రాసి పెట్టేశాడట" అని.

ఈ పదిమందిలో ఒకావిడ కూతురు కాంపిటీషన్ ఎగ్జామ్స్కి వెడుతోంది. స్వతహాగా బాగా చదివే పిల్లే. కానీ పరీక్షలనగానే వచ్చే ఒక రకమైన టెన్షన్. ఆ ఒత్తిడి తగ్గించుకోవ టానికి మనసుకి దొరికే గడ్డిపరక భక్తి, మొక్కులు. 'ఏ పుట్టలో ఏ పాముందో. తోటకి వెళ్ళి ఓ దండం పెట్టుకుంటే నష్టమేముందీ' అని అభిప్రాయపడింది ఆ అమ్మాయి. కాలం ఖర్మం కలిసివచ్చి మొదటిసారే అనుకున్న ర్యాంక్ వచ్చేసింది తనకి. ఇక ప్రచారం మొదల యింది. జోరయింది. ముఖ్యంగా పరీక్షలు రాసేవాళ్ళు ముందుగా తోట సమాధి దగ్గర తప్పనిసరిగా అటెండెన్స్ వేయించుకోవటం మొదలుపెట్టారు. వీళ్ళలో ఎంతమంది గట్టె క్కారో ఎంతమంది తప్పారో తెలీదుగానీ పాసైన వాళ్ళు గోపాలు మహత్యాన్ని పెంచేశారు.

అలా వస్తున్నవాళ్ళు ఎన్నాళ్ళని దండంతో సరిపెడతారు. ఒకరు కొబ్బరికాయ కొట్టి కానుకలకి శ్రీకారం చుట్టారు. అగరువత్తుల ధూపంవేసి అరటిపళ్ళు నైవేద్యం పెట్టారొకరు. సమాధి మట్టి బొట్టయింది కొందరికి. దీపం పెడితే గాలికి ఆగట్లేదని చుట్టూరా దడికట్టి పైన కొబ్బరిఆకులు వేశారు నలుగురూ కలిసి.

తన తోటలో ఈ కలకలం తలనొప్పిగా ఉన్నా భరించక తప్పట్లేదు సుబ్బారాయుడికి. ఇలా ఉండగా విషయం ప్రాముఖ్యం సంతరిం చుకుని ఇంకొంచెం ముందుకెళ్ళింది.

పెళ్ళయి మూడునాలుగేళ్ళయినా సంతానం కలగని ఒకావిడ, ఊరగాయకోసం మామిడి కాయలు కోయించుకోటానికి తోటకి వెళ్ళి, పిల్లలు సమాధి దగ్గర దణ్ణాలు పెట్టుకోవటం చూసి యథాలాపంగా తనూ చేతులు జోడిం చింది. 'నీలాంటి కొడుకు నియ్యి. నీకు గుడి కట్టిస్తా' అనుకుందట. మూణ్ణెల్లు తిరక్కుండా ఆవిడ కడుపు పండింది. ఊరు గుప్పుమంది.

ఆవిడ గర్భాశయంలో ఏదో చిన్న ఇబ్బంది. పిల్లలు కలక్కపోటానికి అది కారణమేమో అని అనుమానం. చిన్న ఆపరేషన్తో ఆ ఆటంకాన్ని ఆ మధ్యనే తొలగించుకుంది. అంచేతనే ఇది సంభవించి ఉంటుందన్న అనుమానం కూడా రానేలేదెవ్వరికీ. మహానందంగా గుడి కట్టించ టానికి పూనుకుందామె. సుబ్బారాయుడి గొంతులో పచ్చివెలక్కాయ అడ్డంపడింది. మింగలేడు కక్కలేడు. కాదనేది తనొక్కడు. ఇవ్వాల్సిందే అనేది ఊళ్ళో మూడొంతుల జనం. స్థలం వదలక తప్పలేదతనికి.

అట్లా గోపాలస్వామి ఆలయం నిర్మించట మైంది. పూజారిని నియమించటమైంది. నానాటికీ బారులుతీరే భక్తజన సందోహానికి మేర లేకపోయింది. వచ్చే రాబడికి లోటు లేకపోయింది. రెండువేళలా ధూపదీప నైవేద్యాలూ ఆర్జిత సేవలకూ కొదువలేక పోయింది. ఆయన జయంతంటూ ఏటా ఉత్సవాలు నిర్వహించటమూ ఆరంభమైంది.

★ ★ ★

పదేళ్ళ తర్వాత- ఊళ్ళో మూడురోజులపాటు జరిగే తిరునాళ్ళు మొదలై రెండోరోజు. ఊరి



జనమే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే జనంతో ఊరు సందడిగా ఉంది.

ఆ సమయంలో రాజు కుటుంబం బస్ దిగింది. చాలా ఏళ్ళ తర్వాత ఇప్పుడే ఇటు రావటం. బావమరిది కూతురి పెళ్ళికి ఇటుగా రాకతప్పలేదు. ఈ ఊరిలో ఆగటం అస్సలు ఇష్టంలేదు రాజుకి- మానుపట్టిన గాయాన్ని గిల్లి మరీ రేపుకోవటమెందుకని.

తను మెట్టిన ప్రాంతమది. తను మసిలిన పరిసరాలివి. ఒక్కసారి వాటిని పలకరించి గంటలో మళ్ళీ బస్సెక్కాలని చిలక కోరిక. కాదనలేకపోయాడు రాజు.

వరదలా తోటవైపు కదులుతోన్న జనంతో పాటు తామూ కదులుతూ "ఏమిటివ్వాళ ఇక్కడ విశేషం?" అనడిగాడు రాజు తనపక్కన నడుస్తోన్న ఒకతన్ని కుతూహలంగా.

"తిరణాలయ్యా, తిరణాల. తెలీదా?" అంటూనే ముందుకెళ్ళిపోయాడా ఆసామి- "ఎక్కడా?" అంటున్న రాజు మాట వినిపించుకోకుండానే.

అతను చెప్పేదేమిటీ- నాలుగడుగులు ముందుకు వేస్తే తెలిసిపోయింది సుబ్బారాయుడి గారి తోటముందు సందడి. తోట బాగా వెనక్కి జరిగిపోయింది. నుయ్యి పూడ్చిన స్థలంలో చిన్న గుడి. రంగులువేసి తోరణాలు కట్టి ముస్తాబయి ఉంది. చుట్టూరా తిరణాల జనం కోసం వేసిన పందిళ్ళు. కొబ్బరికాయలు మొదలు గాజులూ పూసలూ గిలక్కాయల వరకూ కొనేవాళ్ళని ఆకర్షిస్తూ తాత్కాలికంగా పెట్టిన అంగళ్ళు

ఆశ్చర్యంగా చూసుకుంటూ ముందుకు నడిచింది రాజు కుటుంబం. గుళ్ళోకి వెళ్ళారు. గుడి చిన్నదే. పీఠం పెద్దది. పీఠం మీదున్న విగ్రహం చిన్నది.

"ఎవరు బాబూ ఈయనా- శివుడా విష్ణుమూర్తా?" ప్రశ్నించాడు రాజు చేతిలో ఉద్ధరిణితో తీర్థమూ చిటికెడు పంచదారా వేసిన పూజారిని. అంత జనంలో పూజారేం వినిపించుకుంటాడు. వరసలో వెనక నుంచున్న భక్తుడు వినిపించుకున్నాడు. వినేవాళ్ళుంటే చెప్పడం చాలా సరదా కొందరికి.

రాజుని పక్కకి పిలిచి కూర్చోబెట్టుకుని "భలేవాడివయ్యా, పేరు కూడా తెలీకుండానే వచ్చావా? శివుడూ విష్ణువూ కాదయ్యా, ఆయన గోపాలస్వామి. పదేళ్ళ బాలుడిగా పదేళ్ళకిందట ఇక్కడ సమాధి అయ్యారు. ఆ పీఠం అదే. ఆ చిన్నవయసులోనే గొప్ప జ్ఞాని. గొప్ప త్యాగి. ఆయుష్షులేని తన చెల్లెలికి తన ఆయువు ధారపోశారు. తనంతట తానుగా బావిలోకి దూకి ప్రాణత్యాగం చేశారు. ప్రాణం లేకపోయినా అద్భుత శక్తుల్ని తనలో నిక్షిప్తం చేసుకున్న ఆ బాలుడి పార్థివదేహాన్ని ఇక్కడ సమాధి చేశారు.

మన కోర్కెలు తీర్చటంకోసం, మనల్ని ఉద్ధరించటంకోసం, మన పాపాల్ని తొలగించటం కోసం, మనకి పుణ్యం ప్రసాదించటంకోసం ఈ సమాధిలో ఈ రూపంలో వెలిసి మనల్ని కాపాడుతున్నాడా బాలస్వామి" భక్తిగా చేతు లెత్తి నమస్కరిస్తూ ఓపిగ్గా వివరించాడాయన.

మతిపోతోంది రాజుకి. "అయ్యో రామా- ఇక్కడ..." నిజం కక్కబోతున్న మగని నోరు చప్పున గట్టిగా మూసేసింది చిలక.

అరగంటలో బస్సెక్కిన తరవాతగానీ ఆ చెయ్యి తియ్యలేదు. తీసిన దగ్గర్నుంచీ- కొడుకు పోయాక అంతగా నవ్వెరగని రాజు పిచ్చివాడిలా తెరలుతెరలుగా నవ్వుతూనే ఉన్నాడు.

తోటలో గోపాలుని పూడ్చిన రాత్రి ఏమయిం దంటే- సుబ్బారాయుడొచ్చి ప్రాధేయపడ్డాడు. "పోయినవాడెటూ పోయాడు. తోటని శ్మశానం చెయ్యొద్దు. నేనక్కడే బోరు తీయించుకోవాలి" అని పాతికవేలు చేతిలో పెట్టాడు.

'గోపాలు తిరిగి రాడు. వాడి శరీరమెక్కడుం టేనేం?' అదోలాంటి వైరాగ్యంలో పూడ్చిన శరీరాన్ని బయటకు తీసి రాత్రికి రాత్రే తోపుడుబండి మీద తీసుకెళ్ళి శ్మశానంలో పూడ్చివచ్చాడు రాజు. అదీ జరిగింది.

ఇప్పుడు వీళ్ళంతా ఉత్సవంగా చేస్తోన్న తిరునాళ్ళూ, చెప్తున్న మాహత్యాలూ, సందడీ, పూజలూ, భజనలూ ఎవరికి?

రాజు తెరలుతెరలుగా నవ్వుతూనే ఉన్నాడు. ★